# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 17, అక్టోబర్ 2025


## అంగరంగ వైభవంగా దండారి ఉత్సవాలు

నేరడిగొండ, ప్రభాతవార్త



మండలంలోని మంగల్ మోట గ్రామంలో దీపావళి పండగ సందర్భంగా వారం రోజుల పాటు ఆదివాసులు సంప్రదాయ బద్దంగా నిర్వహించే దండారి ఉత్సవాలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ ఉత్సవ ఆహ్వాన మేరకు రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం లోనే కాకుండా ప్రపంచంలోనే పేరు ప్రఖ్యాతలు గడిచాయని ఆదివాసి బిడ్డలకు గుర్తింపును తెచ్చిపెట్టిందని దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం వల్ల ఐక్యత పెరుగుతుందని అన్నారు. భారతదేశంలో ఉన్నటువంటి సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచంలో మరేక్కడ లేవని సూచించారు.

### తపాలాశాఖ ద్వారా నూతన ఓటర్లకు

## గుర్తింపు కార్డులను అందించాలి



*** రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి**

ఆసిఫాబాద్, అక్టోబర్ 16, ప్రభాతవార్త

తపాల శాఖ ద్వారా నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, సహాయ ఎన్నికల అధికారులు, తహసిల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితాలో 100 సంవత్సరాల వయసు కలిగిన ఓటర్లను గుర్తించి వారి వయసును తగిన ఆధారాలతో సమర్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని, ఫారం 6, 7, 8 దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ ధోత్రే, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్‌లతో కలిసి హాజరయ్యారు. జిల్లాలో నూతనంగా ఓటరుగా నమోదైన వారికి తపాలా శాఖ ద్వారా ఓటరు మిగతా 2లో..




## అంతర్రాష్ట్ర సరిహద్దు ఉన్న ప్రాంతాల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి



**★ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్**

కౌటాల, అక్టోబర్ 16, ప్రభాతవార్త

వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం జిల్లా పోలీసు అధికారి కాంతిలాల్ పాటిల్ కౌటాల సర్కిల్ పోలీస్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా ఎస్పీ మొదట పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కాగజ్‌నగర్ డిఎస్పీ వాహిదుద్దీన్‌తో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. సర్కిల్ కార్యాలయ పరిసర పరిశుభ్రతను పరిశీలించి, అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్ కేసుల వివరాలను సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సర్కిల్ కార్యాలయ రికార్డులను తనిఖీ చేస్తూ, ఎలాంటి కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలని, జరిగిన నేరాలను సర్కిల్ మ్యాప్‌లో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. గ్రేవ్ కేసులపై నాణ్యమైన దర్యాప్తు చేసి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మర్డర్, డౌరీ డెత్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైతే టెక్నికల్ సపోర్ట్ వినియోగించుకోవాలని సూచించారు. సర్కిల్ పరిధిలో గల పోలీస్ స్టేషన్లను తరచుగా సందర్శిస్తూ ఆయా కేసులపై సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఎస్పీ పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో ఉన్న కె.డి, సస్పెక్ట్, రౌడీ షీట్స్ తెరిచిన వ్యక్తులను నిరంతరం చెక్ చేస్తూ, వారి కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ఆస్తి సంబంధిత నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను క్రైమ్ హాట్ స్పాట్స్‌గా గుర్తించి, నిఘాను మరింత బలోపేతం చేయాలని అన్నారు. నేరాల అదుపు, జరిగిన నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొని, ప్రతి స్టేషన్ పరిధిలో వీటి ఏర్పాటు కోసం కృషి చేయాలని అన్నారు. సర్కిల్ పరిధిలో ఉన్న లాంగ్ పెండింగ్ కేసులు, ఎన్‌బిడబ్ల్యూలు వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలని సూచించారు. అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని, మిగతా 2లో..

## సమస్యలు పరిష్కరిస్తాం

**● ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్**

కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 16, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దంటే విఠల్ అన్నారు. గురువారం కాగజ్‌నగర్ మండలం అంకుషాపూర్ గ్రామంలో ఎమ్మెల్సీ దండే విఠల్ పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సమక్షంలో మాజీ ఎంపీటీసీలు ఠాక్రే కమలాబాయి, లక్ష్మణ్, నాయకులు సాంబయ్య, నారాయణ, రాజు, వసంతరావు, మురళి, సోనేరావు, పులి మేర, వత్తు ధర్మయ్య తదితరులు కాంగ్రెస్ పార్టీ తీర్థం మిగతా 2లో..



### గురుకులాల్లో సీట్ల భర్తీకి

## దరఖాస్తుల స్వీకరణ



**❋ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త

జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినీ, విద్యార్థులు, గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 17 వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా లక్షెట్టిపేట (బాలికల) గురుకుల విద్యాలయంలో దరఖాస్తులు సమమర్పించాలని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు హాల్ టికెట్, ర్యాంకు ధ్రువీకరణ పత్రాల నకలు ప్రతులు జత పరచాలని మిగతా 2లో..

## ఘనంగా లక్ష కుంకుమార్చన

కాగజ్‌నగర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త

ఇస్గాం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అనుసంధాన శ్రీ లక్ష్మి కుబేర సామూహిక లక్ష కుంకుమార్చన, పూజ భక్తి శ్రద్ధలతో గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దాదాపు 1100 మంది మహిళలు పాల్గొని కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తి వాతావరణంతో మారుమ్రోగింది. జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, వాసవి మాత ఆశీర్వాదంతో సకల శుభాలు కలగాలని ప్రార్థించామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, భక్తులు, మహిళా సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో నిర్మితమవుతున్న ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం సహాయ సంఘాల సభ్యులకు రుణ సదుపాయాలు కల్పించి వ్యాపారాలు చేసి ఎదిగేందుకు ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర సరిహద్దు ఉన్న ప్రాంతాల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

*(మొదటిపేజీ తరువాయి)*

ఎలాంటి అక్రమ కార్యకలాపాలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. సర్కిల్ పరిధిలో గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సర్కిల్ కార్యాలయం రికార్డుల నిర్వహణ,దర్యాప్తు తీరు సంతృప్తికరంగా ఉందని అభినందిస్తూ సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్,ఎస్ఐలను,సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు.

## తపాలాశాఖ ద్వారా నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులను అందించాలి

*(మొదటిపేజీ తరువాయి)*

గుర్తింపు కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఓటరు జాబితాలో 100 సంవత్సరాలు వయసు పైబడిన ఓటర్లను గుర్తించి వారి నిజ వయసు ఆధారంగా సవరించడానికి చర్యలు తీసుకుంటామని, జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో గల బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెండింగ్‌లోని ఫారం 6, 7, 8 దరఖాస్తులు పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పర్యవేక్షకులు శ్యాం లాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరిస్తాం

*(మొదటిపేజీ తరువాయి)*

పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్సీ దండే విఠల్ పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. అంకుషాపూర్ కి ప్రధాన సమస్యగా ఉన్న వాగుపై వంతెన నిర్మాణం పూర్తి చేయాలని అలాగే రాకపోకలకు తాత్కాలిక మార్గం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడారు. అలాగే వంజరి గ్రామ పంచాయతీ పరిధిలోని సిఆర్ నగర్, ఎస్ కాలనీ లోని నీటి సమస్య ఉంది అని తెలుపగా సంబంధించిన అధికారిని పిలిపించి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాజామాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

*(మొదటిపేజీ తరువాయి)*

సూచించారు. లక్షెట్టిపేట, చెన్నూరు, మందమర్రి, బెల్లంపల్లి (బాలికలు), బెల్లంపల్లి, కాసిపేట, కోటపల్లి, మంచిర్యాల, జైపూర్ (బాలుర) సాంఘిక సంక్షేమ గురుకులాలలో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 18న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేసి, భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. బాలికల గురుకులాలలోని 6వ తరగతిలో ఎస్ సి 6, ఎస్టి 2, బీసీ 3, జనరల్ 3, మైనారిటీ 2 సీట్లు ఉన్నాయని, 7వ తరగతిలో బీసి 5 సీట్లు, 8 వ తరగతిలో ఎస్‌సి 4, ఎస్టి 1, బీసీ 10, జనరల్ 6, మైనారిటీ 5, 9వ తరగతి లో ఎస్‌సి 3, ఎస్టి 4, బీసీ 4, జనరల్ 5, మైనారిటీ 3 సీట్లు ఉన్నాయని తెలిపారు. బాలుర గురుకులాలలో 5వ తరగతిలో, ఎస్టి 3, జనరల్ 3, మైనారిటీ 2 సీట్లు, 6వ తరగతిలో ఎస్‌సి 9, ఎస్టి 5, జనరల్ 1, మైనారిటీ 6 సీట్లు, 7వ తరగతిలో ఎస్‌సి 5 సీట్లు, 8వ తరగతిలో ఎస్ సి 8, బీసీ 8, జనరల్ 6, మైనారిటీ 8, 9వ తరగతిలో ఎస్ సి 11, బీసీ 4, ఓసీ 7, మైనారిటీ 5 సీట్లు ఉన్నాయని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**రామకృష్ణాపూర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

క్యాతన్‌పల్లి పరిధిలోని క్రైస్ట్ స్కూల్ దగ్గర బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తిమ్మాపూర్‌కు చెందిన భీమా సుధాకర్ (65) మృతిచెందారు. మంచిర్యాల నుండి మందమర్రి వైపు అతివేగంగా వెళ్తున్న ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. గాయపడిన సుధాకర్‌ను బంధువులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు మరణించినట్లు నిర్ధారించారు. మృతుని బాబాయ్ భీమా నగేష్ ఫిర్యాదు మేరకు రామకృష్ణాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ వివరాలు వెల్లడించారు.

## సీపీఆర్ పై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

### - నస్పూర్ పిహెచ్‌సి డాక్టర్ వెంకటేష్


**నస్పూర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడేందుకు ఉపయోగపడే సీపీఆర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని నస్పూర్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ వెంకటేష్ అన్నారు. గురువారం సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉద్యోగులకు సీపీఆర్ పనితీరు, లాభాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నస్పూర్ పిహెచ్‌సి డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ, వ్యక్తి శ్వాస తీసుకోవడం లేదా గుండె కొట్టుకోవడం మందగించినప్పుడు చేసే అత్యవసర ప్రథమ చికిత్సనే సీపీఆర్ అన్నారు. గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితులలో సీపీఆర్ చేయడం చాలా ముఖ్యమని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. అత్యవసర సమయంలో 108 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ నాందేవ్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ స్వామి, 108 పైలట్లు పిల్లి రమేష్, సతీష్, దేవయ్య, మహేష్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అంధకారంలో జమున నగర్ కాలనీ

**కెరమెరి, అక్టోబర్ 16, ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని జమున నగర్ కాలనీలో గత రెండు మాసాలుగా వీధి దీపాలు అమర్చక పోవడంతో కాలనీ అంధకారంలో మగ్గుతుంది. కాలనీవాసులు గ్రామపంచాయతీ అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని వాపోయారు. రాత్రివేళ కాలినడకన నడిచేవారు ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు అమర్చాలని కాలనీవాసులు కోరారు.



## పంట కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

**బోథ్, అక్టోబర్ 16 ప్రభాతవార్త**

పత్తి సోయ, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, పంటలు ఖరీదు చేసిన 3 రోజులలోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని బోథ్ శాసనసభ్యుడు అనిల్ జాదవ్ పేర్కొన్నారు. గురువారం అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నత అధికారుల సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కిసాన్ కపాస్ యాప్ ద్వారా రైతులు ఇబ్బందుల్లో పడతారని నియోజకవర్గంలో ఆయా గ్రామాల్లో సెల్ ఫోన్ సిగ్నల్ కూడా వచ్చే అవకాశం లేదని అలాంటి గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించి కిసాన్ కపస్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేయించే విధంగా చూడాలని అన్నారు. అలాగే స్థానిక రైతు వేదికల్లో రైతులకు స్లాట్ బుకింగ్ చేసే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని, రాష్ట్రంలో రైతులు తమ పంటలను ఎక్కడైనా అమ్ముకునే విధంగా సడలింపు ఇవ్వాలని మొదటి విడత సరుకు అమ్మే రైతులకు తేమశాతం తగ్గించే విధంగా చూడాలని అన్నారు. మార్కెట్ జిన్నింగ్ మిల్లుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రైతులకు మధ్యాహ్న భోజనం మంచినీటి సౌకర్యం కల్పించాలని సూచించారు.

## ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

**నేరడిగొండ, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

స్థానిక మండల కేంద్రంలోనీ పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ పశు వ్యాధుల నివారణ టీకాల కార్యక్రమం గురువారం పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచితంగా చేపట్టిన వ్యాధి నివారణ టీకాలను పాడి పశువులు కలిగిన రైతులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పశువులకు ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలని సూచించారు.

**మామడ, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

మండలంలోని దిమ్మదుర్తి గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమం గురువారం జిల్లా పశు వైద్య అధికారి రాజేశ్వర్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతులు పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని ఆయన అన్నారు. ఇందులో భాగంగా మామడ మండల వైద్యధికారి మహేష్, పొనకల్ వైద్యధికారి షాహియర్, పరస్టాఫ్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.



# ఓటర్ కార్డు సంబంధిత దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**- రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి**







**నస్పూర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

రాష్ట్రంలో నూతన ఓటరు కార్డులు, ఓటరు జాబితా సంబంధిత దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాదు నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, సహాయ ఎన్నికల అధికారులు, తహసిల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి మాట్లాడుతూ నూతన ఓటర్ కార్డు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల కొరకు అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ఓటరు జాబితాలో 100 వయసు పైబడిన ఓటర్లను గుర్తించాలని, వారి వివరాలను తగిన ఆధారాలతో సమర్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులను నియమించి వారి వివరాలను పోర్టల్ లో నమోదు చేయాలని, వారికి నూతన ఓటరు కార్డులను అందించాలని తెలిపారు. ఫారం 6, 7, 8 లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, నూతన ఓటర్ కార్డుల కొరకు నమోదు చేసుకున్న అర్హత గల అభ్యర్థులకు తపాలా శాఖ ద్వారా ఓటరు కార్డుల పంపిణీ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని, పంపిణీ చేయబడిన వివరాలతో నివేదిక రూపొందించి సమర్పించాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ నూతనంగా నమోదైన ఓటర్లకు గుర్తింపు కార్డులను తపాలా శాఖ ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 100 సంవత్సరాల వయసు పైబడిన ఓటర్లను గుర్తించి వారి నిజ వయసు ఆధారంగా సవరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీకి చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ వలియత్ అలీ, బెల్లంపల్లి తహసిల్దార్ కృష్ణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రేపు జరిగే బిసి బంద్‌కు అందరూ సహకరించండి

**- మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మన్**

**జన్నారం, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

రేపు రాష్ట్ర వ్యాప్తంగా జరిగే బిసి బంద్‌కు వ్యాపారస్తులు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు అందరూ సహకరించాలని మున్నూరు కాపు సంఘం జన్నారం మండల అధ్యక్షులు కాసెట్టి లక్ష్మన్ కోరారు. గురువారం మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బిసిల విషయంలో జరిగిన పరిణామాలకు వ్యతిరేకంగా 42 శాతం బిసి రిజర్వేషన్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర బిసి జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన జరిగే రాష్ట్ర బంద్‌కు మండల కేంద్రంలోని సమస్త వ్యాపారస్తులు అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు, అన్ని కులాల బంధావులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించి ధర్నా, బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్నూరు కాపు సంఘం తరఫున ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కొంతం శంకరయ్య, ప్రధాన కార్యదర్శులు గోపె సత్య నారాయణ, నోముల రాజకుమార్‌లు, ముఖ్య సలహాదారుడు సీపతి ఆనందం, ఉపాధ్యక్షుడు ఆంధ్ర పురుషోత్తం, పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు అనుమల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి పూదరి నాగన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ మారుతి సతీష్, ప్రచార కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీకా వేసిన పశువుల వివరాలు సక్రమంగా నమోదు చేయాలి

**- జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సురేష్**

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**



గాలికుంటు నివారణ టీకా పంపిణి కార్యక్రమంలో టీకా వేసిన పశువుల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సురేష్ సూచించారు. గురువారం కాగజ్‌నగర్ మండలంలోని రేగులగూడలో నిర్వహించిన టీకా పంపిణి కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. టీకా కార్యక్రమంలో కోల్డ్ చైన్ నిర్వహణ, టీకా వేసిన పశువుల వివరాల సక్రమణ,నమోదు విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి మాట్లాడుతూ పశుపోషకులు పశువులకు తప్పకుండా గాలికుంటు వ్యాధి నివారణ కోసం పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకా పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ పశువైద్యాధికారి డాక్టర్ వద్దూరి పరిమళ, గ్రామ ఎల్‌ఎస్‌ఎ శైలేందర్, విఎలు అమన్, సునిల్, ఓఎస్ శ్రీను, గోపాల మిత్రలు దేటి రమేష్‌బాబు, జమీర్, వంశీ, పశుపోషకులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్‌కు ఆర్థిక సహాయం అందజేత

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలంలోని చింతగుడ కొయవాగు గ్రామ యువకులు నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌కు బిఆర్ఎస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యామ్‌రావు 5 వేల రూపాయలు ఆర్థిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల ద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానం అలవర్చుకోవాలని, గ్రామ స్థాయిలో ఇలాంటి క్రీడా కార్యక్రమాలు గ్రామ అభివృద్ధికి దోహదపడతాయని ఆయన అన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌కు ఆర్థిక సహాయం అందజేసిన లెండుగురె శ్యామ్‌రావుకు క్రీడా నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట కోయవాగు ఉపసర్పంచ్ ఆడె రాజు, గ్రామ పెద్దలు, యువకులు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**లింగాపూర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**



మండల కేంద్రంలో సెర్ప్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమానికి బయ లుదేరుతున్న ఇందిరా క్రాంతి పథకం ఉద్యోగులుగా పనిచేస్తున్న వివోఏలను పోలీసులు సెర్ప్ ముట్టడికి వెళ్లకుండా అరెస్టు చేశారు. ఈ అక్రమ అరెస్టులను నిరసిస్తూ, వివోఏలా మండల ఉపాధ్యక్షుడు, చాటే పాండురంగ్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఎవరు ఆపలేరు. మేము ఏమన్నా గుంతమ్మ కోరికలు కోరుకోవడం లేదు. చేస్తున్న పనికి కనీస వేతనం, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఎన్నికల సమయంలో ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా, 26వేల గౌరవ వేతనం ఇవ్వాలి. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. ఇన్సూరెన్స్ బీమా సౌకర్యం కల్పించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి అని ప్రభుత్వానికి ఎన్నిసార్లు మా బాధ వినిపించినప్పటికీ చేస్తాం చూస్తాం అనేటోలే తప్ప, చేసేటోలు చూసేటోలు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలంటే. ముందు మమ్ములను పస్తులు లేకుండా చూడాలని విన్నవించారు. చాలీచాలని 5000 వేల గౌరవ వేతనంతో మా కుటుంబం ఎలా పోషించాలి అని ఆవేదన వ్యక్తం చేశారు. మా సమస్య పరిష్కారం కాని పక్షాన అసెంబ్లీ ముట్టడికి కూడా భయపడమని తెల్పడం జరిగింది.

## ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం, నష ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం

**లక్షెట్టిపేట, ప్రభాతవార్త**



మండలంలోని వెంకట్రావు పేట గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం రోజున నష ముక్త్ భారత అభియాన్ కార్యక్రమంలో భాగంగా రంగోలి ప్రోగ్రాం నిర్వహించారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్ వాణి మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞా, మాదక ద్రవ్యాలు వాడకం వల్ల కలిగే నష్టాలు వివరించడం జరిగింది. అలాగే పోషణ మాసంలో భాగంగా చిన్నారికి అన్న ప్రాసన నిర్వహించి, పోషణ ప్రతిజ్ఞ చెయ్యడం జరిగింది. గర్భిణి స్త్రీలు తీసుకోవలసిన పౌష్టికాహారం, ఆరోగ్యానికి సంబంధించిన తగు సూచనలు ఇవ్వడం జరిగింది. అలాగే పిల్లలు పుట్టినప్పటి నుండి 6 నెలల వరకు కేవలం తల్లి పాలు చాలు, 7 నెలల నుండి 2 సంవత్సరాల వరకు తల్లి పాలతో పాటు అనుబంధ పోషకాహారం గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ సుగుణ, శారద, ప్రతిభ, స్వప్న, వసంత, గర్భిణీలు, బాలింతలు, అంగన్వాడి పిల్లలు, స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీలో స్లెట్ స్కూల్ విద్యార్థుల సత్తా

**జన్నారం, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో స్లెట్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 అండర్ 17 విభాగంలో ఈ నెల 15వ తేదీన జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ మంచిర్యాల క్లబ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో జన్నారం మండల కేంద్రంలోని స్లెట్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. అండర్ 17 బాలుర విభాగంలో మణికంఠ, బాలికల విభాగంలో సహస్ర, గౌతమి, అదేవిధంగా అండర్ 14 బాలికల విభాగంలో గీతిక, శ్రద్ధ శర్మలు ఎంపికైనట్లు స్కూల్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్కూల్ చైర్మన్ తోపాటు డైరెక్టర్ ఏనుగు రజిత రెడ్డి ప్రిన్సిపాల్ శిరిన్ ఖాన్, పీఈటిలు సంతోష్, నగేష్, జోష్నా, ఉపాధ్యాయులు క్రిష్ణ అభినందించారు.

## అనారోగ్యంతో బాలింత మృతి

**కెరమెరి, అక్టోబర్ 16, ప్రభాతవార్త**



కెరమెరి మండలంలోని కొలంగురి గ్రామానికి చెందిన సిడాం అయ్యుబాయీ (30) అనే బాలింత మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. గత ఆదివారం ప్రసవించి పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. మృతురాలికి ఏడు, రెండు సంవత్సరాల కూతుర్లు, ఐదు సంవత్సరాల కొడుకు. ఇప్పుడు పసికందు ఉన్నారు. తన భార్య చనిపోవడంతో నలుగురు పిల్లల అలనాపాలన ఎలా చూసుకోవాలని మృతురాలి భర్త సిడాం రాము కన్నీరు పెట్టుకున్నారు.

# ఎస్పీఎం కార్మిక సంఘాల ఎన్నికలను అడ్డుకుంటున్న యజమాన్యం

**- ఆందోళన పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపు - బిఆర్ఎస్, ట్రేడ్ యూనియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు అంబాల ఓదెలు**

కాగజ్‌నగర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త

సిర్పూర్ పేపర్ మిల్లులో యూనియన్ల గుర్తింపు కై జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను గత సంవత్సరమే ప్రారంభించిన లేబర్ అధికారులు పేపర్ మిల్లు యజమాన్యం ఒత్తిడి వల్ల వెనక్కు తగ్గారని బిఆర్ఎస్, ట్రేడ్ యూనియన్ విభాగం జిల్లా అధ్యక్షులు అంబాల ఓదెలు అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడిన పక్కనే ఉన్న దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఎన్నికలు జరిగినప్పటికీ సిర్పూర్ పేపర్ మిల్లులో మాత్రం ఎన్నికలు జరగకుండా జెకె పేపర్ మిల్లు యాజమాన్యం అడ్డుకట్ట వేస్తుందని అన్నారు. ప్రభుత్వ అధికారులకు, లేబర్ అధికారులకు ఉత్తరాలు, మెమొరండాలి ఇస్తే ఎన్నికలు జరగవని, సిర్పూర్ పేపర్ మిల్లు జెకె యజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులతో పోరాటాలు చేస్తేనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అవుతుందని అన్నారు. ఈ నెలలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభించుటకు యజమాన్యం సహకరించని ఎడల పెద్ద ఎత్తున ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భారత రాష్ట్ర సమితి జనరల్ సెక్రెటరీ గారి ఆధ్వర్యంలో కార్మికులతో పోరాటాలు చేయగలమని ఓదెలు హెచ్చరించారు. కార్మికుల తరఫున మాట్లాడే గుర్తింపు సంఘం లేకపోవడం వల్ల గతంలో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, సౌకర్యాలు రద్దు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సర సెలవులు 30 నుండి 24 తగ్గించారని, ఆవరేజ్ గా పది శాతం ఉన్న ప్రొడక్షన్ బోనస్ ను రద్దుచేసి స్లాబ్ ల పేరిట కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ ప్రొడక్షన్ బోనస్ తగ్గించి కార్మికులకు నష్టం చేస్తున్నారని అన్నారు. మిల్లులో కార్మిక చట్టాలు అమలు కావడం లేదని జెకె పేపర్ మిల్లు చెప్పిందే చట్టం చేసిందే శాసనంగా కార్మికులు శ్రమ దోపిడికి గురవుతున్నారని అన్నారు. ఆన్ డ్యూటీ లో ప్రమాదాలు జరిగిన కార్మికులకు యాక్సిడెంట్ రిపోర్ట్ రాయటం లేదని, 90 శాతం డిపార్ట్మెంట్లను ప్రైవేటు కాంట్రాలకు అప్పజెప్పి స్థానిక కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. హక్కులు, సౌకర్యాలు అడుక్కుంటే రావని కార్మికులు కొట్లాడుతూనే వస్తాయని వెంటనే గుర్తింపు సంఘాల ఎన్నికల నిర్వహణకు కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు.





## పోషకాహారమే ఆరోగ్యానికి బలమైన పునాది

పెంచికల్ పేట్, అక్టోబర్ 16, ప్రభాతవార్త

పోషకాహారమే ఆరోగ్యానికి బలమైన పునాది అని సిడిపిఓ విజయలక్ష్మి అన్నారు. గురువారం పెంచికల్ పేట్ గ్రామ పంచాయతీలోని అంగన్వాడీ సెంటర్లో పోషణ మాసంలో భాగంగా అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ విజయలక్ష్మి మాట్లాడుతూ స్వచ్ఛమైన ఆహారం, సక్రమమైన ఆహార అలవాట్ల వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని పిల్లలు, తల్లులు, గర్భిణీలు కూరగాయలు, పాలు పండ్లు పోషకహారంలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమములో ఎసిడిపిఓ హేమలత సూపెర్వైజర్ కరుణ రెడ్డి అంగన్వాడీ, ఆశా వర్కర్స్ తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

## పర్యావరణ హిత వస్తు ప్రదర్శన

కాగజ్‌నగర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని పర్యావరణానికి మేలు చేసే ఉత్పత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "క్యాంపస్ ఈకో బజార్" పేరుతో ప్రత్యేక వస్తు ప్రదర్శనను ఈ నెల 18న నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి, ఎకో క్లబ్ కోఆర్డినేటర్ డా. వి. దేవేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరుగుతుందని, తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్‌జిసి) స్పాన్సర్‌గా వ్యవహరిస్తోందని వారు పేర్కొన్నారు. విద్యార్థులు స్థానికంగా లభించే సహజ ముడి పదార్థాలతో తయారు చేసిన పర్యావరణ హిత ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర జీవన విధానాలపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ ప్రదర్శనను ఉదయం 10 గంటలకు కాగజ్‌నగర్ డివిజన్ సబ్ కలెక్టర్ శ్రీమతి శ్రద్ధా శుక్లా ప్రారంభించనున్నారు.

## ఇంటింటికి కళాశాల అధ్యాపకులు

సారంగాపూర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు కళాశాలకు రావడంలేదని వారి ఇంటికి వెళ్లి హాజరు శాతం మెరుగుపరచడం కోసం నూతనంగా ఇంటర్మీడియట్ బోర్డ్ ముఖ గుర్తింపు విధానం (ఎఫ్.ఆర్.స్) ప్రవేశపెట్టడం ద్వారా హాజరు శాతం లేకపోతే విద్యార్థులకు, అధ్యాపకులు చెప్పే పాఠాలు అర్థం కాలేక పరీక్ష లలో సరిగా వ్రాయలేరు అని రోజు కళాశాలకు వచ్చి చదువుకోవడంతో మంచి మార్కులతో పాసైతారు. కళాశాలలో అదనంగా టీటీసి, ఎంసెట్, ఐఐటీ క్లాసులు చెప్పడం జరుగుతుంది. వీటిని మీ పిల్లలు సద్వినియోగం చేసుకుంటే వారి భవిష్యత్తు బాగుటుంది అని తల్లిదండ్రులకు చెప్పినారు. పిల్లలలను రోజు తప్పకుండ కళాశాలకు పంపాలని. బోర్డు వారు కఠిన చర్యలు తీసుకుంటే పిల్లలు నష్టపోతారు. పరీక్ష సమయం దగ్గరికి వచ్చింది. నిత్యం స్టడీ అవర్స్ నిర్వహిస్తూ, మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తున్నాం అని అధ్యాపకులు చెప్పినారు. విద్యార్థుల తల్లిదండ్రులకు తప్పకుండ కళాశాల పంపాలని కోరినారు. ప్రభుత్వం మీ కోసం అన్ని వసతులు కల్పిస్తుంది వాటిని వినియోగించు కొని ఉన్నత స్థానం ఉడాలి అని చెప్పారు ఇందులో శంకర్, శ్రీనివాస్ గాంధీ మొదలగు అధ్యాపకులు పాల్గొన్నారు.





## 18న తెలంగాణ బీసీ బంద్ విజయవంతం చేయాలి

కాగజ్‌నగర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త

బీసీ కులాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం కాగజ్‌నగర్‌లోని యాదవ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 18న జరగబోయే తెలంగాణ బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని, పట్టణ ప్రజలందరూ బంద్‌కు సహకరించాలని కోరారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను ఎవ్వరూ అడ్డుకోలేదు, కానీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను రెడ్డి జాగృతి కుట్రతో అడ్డుకోవడం జగిరిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్‌పై స్పష్టమైన హామీ ఇవ్వని రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ నీకోడే రవీందర్, పొన్న రమేష్, మాచర్ల శ్రీనివాస్, పుల్గం వెంకటేష్, మెహరాజ్, బీఆర్ఎస్ నాయకులు అంబాలా ఓదెలు, గోలేం వెంకటేష్, బీజేపీ నాయకులు గజ్జల లక్ష్మణ్, కొండా తిరుపతి, పుల్ల అశోక్, టీఆర్‌పీ నాయకులు శ్రీనివాస్, పద్మశాలి సంఘం నాయకులు నాగేశ్వర్, బోగా వెంకటేష్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అధ్యక్షులు జయదేవ్ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

కౌటాల, అక్టోబర్ 16, ప్రభాతవార్త

కౌటాల మండలంలోని శిర్ష గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను గురువారం ఎంపీడీవో కోట ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కి సూచించారు. అనంతరం గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కూడా పరిశీలించి, ఇంకా ప్రారంభించని లబ్దిదారులు తక్షణం పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల ఈ కేవైసీ ప్రక్రియ వేగవంతం చేయాలి

కౌటాల, అక్టోబర్ 16, ప్రభాతవార్త

ఉపాధి హామీ కూలీల ఈ కేవైసీ ప్రక్రియ వేగ వంతం చేయాలని కౌటాల ఎంపిడివో కోట ప్రసాద్ అధికారులకు సూచించారు. గురువారం కౌటాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ కూలీలు ఇకేవైసి ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని, రాబోయే సంవత్సరానికి పనులు గుర్తించుటకు తీసుకోవలసిన జాగ్రత్తలు, నర్సరీ నిర్వహణ, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, నిర్మాణాలు ప్రారంభించని లబ్దిదారులను ప్రోత్సహించి త్వరగా నిర్మాణాలు చేపట్టే విధంగా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి, ఏపీవో పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.



## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

**- ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు**

పెంచికల్ పేట్, అక్టోబర్ 16, ప్రభాతవార్త

పెంచికల్ పేట్ మండలంలోని బొంబాయి గూడ, పోతేపల్లి గ్రామాల్లో గురువారం పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోతేపల్లి, బొంబాయి గూడ గ్రామాల్లో గుడుంబా విక్రయాలు జరుగుతున్నాయని అందిన సమాచారం మేరకు గురువారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో దాడులు చేయగా పోతపెల్లి గ్రామంలో పది లీటర్ల గుడుంబా, బొంబాయి గూడ గ్రామంలో రెండు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామని. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాల్లో గుడుంబా తయారుచేసిన అమ్మకాలు జరిపిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ శ్యామ్, సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్ఎంపీ, పీఎంపీలపై చర్యలు తీసుకోవాలి

**ఆసిఫాబాద్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రోగులకు హైడోస్ ఇంజెక్షన్స్ ఇస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్ఎంపీ, పీఎంపీలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గోడిసెల కార్తీక్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారు 550 పైన ఆర్ఎంపి, పిఎంపీలు ఉన్నారని, గ్రామ, పట్టణ, మండల కేంద్రాల్లో ఏలాంటి అనుమతులు లేకుండా ఆర్ఎంపి దవఖానాలు ఏర్పాటు చేసుకొని అందులో పడకలు పెట్టి ఐవి క్యాన్లు రోగులకు పెట్టి హైడోస్ ఇంజక్షన్లు, గ్లూకోజ్‌లు పెడుతున్నారని ఆరోపించారు. అదేవిధంగా వారు తమ హద్దులు మీరి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ అనారోగ్యాలకు గురి చేస్తున్నటువంటి పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గతంలో డిఎంహెచ్ఓకు వినతిపత్రం ఇచ్చినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాజకీయ నాయకుల అండదండలతో ఆర్ఎంపీలు, మెడికల్ ఏజెన్సీలు చెలరేగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చొరవ చూపి ఆర్ఎంపి, పిఎంపీ లపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిచల్ ఉన్నారు






## పిచ్చి మొక్కలు తొలగింపు

**సారంగాపూర్, అక్టోబర్16, ప్రభాతవార్త**

నిర్మల్ నుండి స్వర్ణ వరకు గల రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఉండడం వలన ఉదయం రాత్రి సమయాలలో నిర్మల్ పట్టణానికి అనేక వాహనాలు పని నిమిత్తమై, ఉద్యోగ నిమిత్తమై వెళ్లడం జరుగుతుంది. నిత్యం దీని ద్వారా రాత్రి సమయాలలో అడవి జంతువుల వలన ప్రమాదాలు జరిగి ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు. వార్త దిన పత్రతికలో ఈనెల 8న రోడ్డుకి ఇరువైపులా పిచ్చి మొక్కలు అనే కథనం ప్రచురించడం జరిగింది. దీనికి స్పందిస్తూ కౌట్ల (బి) పంచాయతీ సెక్రటరీ కే.సుధాకర్, తమ గ్రామ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్లలతో కౌట్ల (బి) నుండి సారంగాపూర్ వరకు కౌట్ల (బి) నుండి స్వర్ణ వరకు గల పిచ్చి మొక్కలను తొలగిస్తూ, ప్రమాదాలు జరగకుండా తమవంతుగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనుల పరిశీలన

**జైపూర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

జైపూర్ మండలం పెగడపల్లి గ్రామపంచాయతీని గురువారం మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు ఆప్ ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా సందర్శించి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను హౌసింగ్ ఏఈతో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలని ప్లాస్టిక్ వ్యర్ధాలు లేకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి. పావని, హౌసింగ్ ఏఈ కాంక్ష, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై మెరుపు దాడి

**చింతలమనేపల్లి, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

మండలంలోని బాబాసాగర్ గ్రామంలో టాస్క్ ఫోర్స్ బృందం మెరుపు దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో రూ. 16,080 నగదు, 52 పేకాట ముక్కలు స్వాధీనం చేసి, చింతలమనేపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. వారి పై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు. అరెస్టయిన వ్యక్తులు 1. బోర్కుటే విఠల్, తండ్రి: లక్షుఖ్ఖుఖ్మణ్, నివాసం: కౌటాల, 2. ధండిగ చిలకయ్య, తండ్రి: భీమయ్య, నివాసం: కొత్తగూడెం, రేబ్బన మండలం, 3. నాగులపల్లి సురేంద్ర, తండ్రి: శంకర్, నివాసం: బాబాసాగర్, 4. ఎర్రోళ్ల వెంకటేష్, తండ్రి: స్వామి, నివాసం: తాలోడి, తప్పించుకున్న వ్యక్తి: 1. ఉంద్రు పుండలిక్, తండ్రి: శివరాం, నివాసం: బాబాసాగర్. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ... జిల్లాలో అక్రమ, అసాంఘిక కార్యకలాపాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. పేకాట, గాంబ్లింగ్, మద్యం అక్రమ రవాణా వంటి చర్యలు చెడు ప్రభావం చూపుతాయని, ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొన్న వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా ఇలాంటి అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనించిన వెంటనే డయల్ 100 లేదా 8712670551 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్పీ ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈ రైడ్‌లో పాల్గొన్న అధికారులు టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్, ఎస్ఐ కంధారి రాజు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది మహమ్మద్, విజయ్, రమేష్, శేఖర్ ఉన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

**- ఎంపీడీఓ వాసుదేవ్**

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 16,ప్రభాతవార్త**



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కాగజ్‌నగర్ ఎంపీడీఓ వాసుదేవ్ సూచించారు. గురువారం కాగజ్‌నగర్ మండల పరిధిలోని బురదగూడెం గ్రామములో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పురోగతిని క్షేత్రస్థాయిలో ఎంపీడీఓ పరిశీలించారు. ఇంటి నిర్మాణ క్రమంలో డబ్బులు జమ అవుతున్నాయా లేదా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇండ్లు నిర్మించుకుంటున్న వారికి దశలవారిగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇంటి నిర్మాణాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎంపీడీఓ వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

## ఎస్సీ గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఆహ్వానం

**ఆసిఫాబాద్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి ప్రవేశాలు జరుగుతున్నాయని గురుకులాల జిల్లా సమన్వయ అధికారి జూలూరు యాదగిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆసిఫాబాద్ (బాలురు), రెబ్బన (బాలికలు), సిర్పూర్ టి (బాలికలు), కాగజనగర్ (బాలికలు) గురుకులాల్లో 6,7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీలను 2025లో బీఎల్వీసెట్ ఎంట్రెన్స్ రాసి జిల్లాకు చెందిన విద్యార్థులతో మెరిట్ లిస్ట్ ప్రకారం ప్రవేశాలు నింపనున్నట్లు పేర్కొన్నారు. దీనికి గాను అభ్యర్థులు పరీక్ష హాల్టికెట్, ర్యాంక్ కార్డు, కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 21లోపు తెలంగాణా సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా సీట్లకేటాయింపు ఉంటుందన్నారు. అదేవిధంగా ఎస్సీలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. 6వ తరగతిలో 12, 7వ తరగతిలో 13, 8వ తరగతిలో 19, 9వ తరగతిలో 25 సీట్లు ఖాళీలకు ఈ స్పాట్ అడ్మిషన్స్ జరుగుతాయన్నారు.

## ప్రమాదకరంగా గుంత

**కెరమెరి, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని నిత్యం రద్దీగా ఉండే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారిలో ఓ మూలమలుపు వద్ద సీసీ రోడ్డుపై ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. మండల విద్యాధికారి కార్యాలయం పశు వైద్యశాల ప్రైవేట్ పాఠశాల సైతం వెళ్లాలంటే ఈ దారి నుండే పోవలసి వస్తుంది. నిత్యం అధికారులు ఈ దారి గుండా వెళుతూ చూస్తూ కూడా పట్టించుకోవడంలేదని ప్రజలు అంటున్నారు. రాత్రి సమయాల్లో ఆసుపత్రి వెళ్లే ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చి మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



## ఉరి వేసుకొని వ్యక్తి మృతి

**లక్షెట్టిపేట, అక్టోబర్ 16, ప్రభాతవార్త**



లక్షెట్టిపేట మండలం ఎల్లారం గ్రామానికి చెందిన వావిలాల రమేష్ (39) ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు వృత్తిరీత్యా లారీ డ్రైవర్. అతిగా మద్యానికి బానిసయ్యడు. ఇంట్లో వాళ్ళు మానుకోమని చెప్పిన మద్యం అలవాటు మానలేదు. ఈనెల 14న మంచిర్యాల వెళ్లి మధ్యాహ్నం అతిగా మద్యం సేవించి వచ్చి మద్యం మత్తులో ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో రేకుల కింది వాసనికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. మృతుని భార్య రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు.

## తాళ్లగురిజాల రైతు వేదికలో పోషణ మాసం కార్యక్రమం

**బెల్లంపల్లి, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పోషణ మాసం కార్యక్రమం తాళ్లగురిజాల రైతు వేదికలో గురువారం రోజున నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ హాజరై పోషణ మాసం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మొదటి వేయి రోజుల ప్రాముఖ్యత, అనుబంధ పోషకాహార ప్రాముఖ్యత, ఐవైసిఎఫ్ పద్ధతులు, తల్లిపాలు ప్రాముఖ్యత, ఈసీసీఈ ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ ఇవాంజెలినా, సిడిపిఓ స్వరూప రాణి, సూపర్వైజర్స్, పోషణ అభియాన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రజిత, డిపిఏ శ్యామల, ఉమెన్ హబ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సౌజన్య, అంగన్వాడీ టీచర్స్, గర్భిణీ స్త్రీలు, ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# రైతులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందిస్తున్నాం

**- ట్రాన్స్‌కో సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ రాథోడ్ శేషారావు**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి వెన్నుముకైన రైతులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సేవలు అందిస్తున్నామని కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ట్రాన్స్‌కో సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ రాథోడ్ శేషా రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ సర్వీసుల మంజూరును యుద్ధ ప్రాతిపదికన విడుదల చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఏర్పడినా 1912 కి ఫోన్ చేసి తెలపాలని కోరారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల జారీలో మరింత పారదర్శకత తీసుకువచ్చామని, కొత్త కనెక్షన్ కొరకు నమోదు చేసుకున్నప్పటి నుంచి సర్వీస్ రిలీజ్ అయ్యే వరకూ ప్రతి దశలోనూ మొబైల్ నంబర్‌కు అప్డేట్ మెసేజ్‌లు తెలుగులో పంపిస్తున్నామన్నారు. రైతులకు ట్రాన్స్‌ఫార్మర్‌ల తరలింపులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండ కొత్తగా వాహనాలను ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయిందని తెలియగానే వెంటనే డిపార్ట్‌మెంట్ వాహనం వెళ్లి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడ అమర్చుతారన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా నిబద్ధతతో పని చేస్తున్నామని, రైతులకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించే దిశగా విద్యుత్ అధికారుల ఖుగపొలంబాటుగ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి వంగిన పోల్‌లను, లూజ్ లైన్లను సరిచేస్తున్నామని, మధ్య స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు .




## రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 16,ప్రభాతవార్త**

వచ్చే సంవత్సరం జనవరి 25 నుండి 28వ తేదీలలో రాష్ట్ర రాజధాని హైదరాబాదు నగరంలో జరుగును ఈ సభలను విజయవంతం చేయాలని అచల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఏఐడిబ్ల్యూఏ) గౌరవాధ్యక్షురాలు మమతా రానా పిలుపునిచ్చారు. గురువారం కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గాంలో 14వ జాతీయ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొనే ప్రధాన సమస్యలు చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొంచడం జరిగిందని అన్నారు మహిళలపై హింస వేధింపులు హత్యలు, హత్యాచారాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి అన్నారు. అధిక ధరలు తగ్గించాలి మహిళలు ఐక్యమై ఉద్యమించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మమతా రానా. సుచిత్ర. కాజల్. వీణ, ఫుల్ మాల తదితరులు పాల్గొన్నారు



## ప్రభుత్వ పాఠశాలలకు భోధన, క్రీడా సామాగ్రి పంపిణీ

**సారంగాపూర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

మండలంలోని జాం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రైమరీ స్కూల్ (పెద్దూర్), ప్రైమరీ స్కూల్ (చిన్నూర్) విద్యార్థులకు రోటరీ క్లబ్ అఫ్ చేంజ్ మేకర్స్, హైదరాబాద్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో విద్యా, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఏలేటి నరసింహ రెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన కుమార్తె శ్రీమతి లావణ్య, దేవేందర్ రెడ్డిలు రూ.లక్ష విలువైన వస్తువులను అందజేశారు. పాఠశాలలకు మైక్ సెట్, కార్పెట్‌లు, నోటీసు బోర్డులు, గ్లోబ్, చెస్ బోర్డు, వాలీబాల్‌లు, ప్రపంచ పటాలు, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్, ప్లేట్స్, గ్లాసులు మొదలైనవి అందజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెడ్‌మాస్టర్ జనార్దన్, ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్లు నర్సయ్య, విజయ్ కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షులు యోగేశ్వర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వర్మి కంపోస్ట్ అందజేత

**లక్షెట్టిపేట, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

మండలంలోని సూరారం గ్రామ పంచాయతీలో డిగ్రిగేషన్ షెడ్‌లో తయారు చేసిన వర్మీ కంపోస్టును రైతులకు 5 కేజీల చొప్పున అమ్మడం జరిగినది. 1 కేజీకి 20 రూపాయల చొప్పున 5 కేజీలకు 100 రూపాయలు, ఐదుగురు రైతులు తీసుకోవడం జరిగినది. గ్రామ పంచాయతీకి 500 రూపాయలు ఆదాయము వచ్చింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె. సరోజ, ఎంపీ ఓ శ్రీనివాస్, ఏపీఓ వేణు గోపాల్, హాజరు సిబ్బంది, సూరారం రైతులు పాల్గొన్నారు.



## జాప్యం లేకుండా సీఎంపిఎఫ్ సేవలు

**బెల్లంపల్లి, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

జాప్యం లేకుండా సీఎంపిఎఫ్ సేవలను ఉద్యోగులకు అందించేందుకు కృషి చేస్తున్నామని సీఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ హరి పచౌరి అన్నారు. గురువారం గోలేటిలోని జనరల్ మేనేజర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రయాస్ మూడో విడత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్లు హరి పచౌరి, గోవర్ధన్‌లు మాట్లాడుతూ సీఎంపిఎఫ్ లావాదేవీలు అన్ని సికేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఉద్యోగులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా సీఎంపిఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు. సీఎంపిఎఫ్ బెనిఫిట్స్‌కు అర్హులు పెన్షన్, రివైస్డ్ పెన్షన్ పట్ల అవగాహన కల్పించారు. ఉద్యోగుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. పెన్షన్, సీఎంపిఎఫ్ దరఖాస్తులు పెండింగ్ ఉండకుండా చర్యలు చేపట్టామన్నారు. జీరో పెండింగ్ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని చెప్పారు. గతంలో పెండింగ్‌లో ఉన్న రికార్డులను ఏరియా అధికారులకు అందించారు. ఉద్యోగుల ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం కె. రాజమల్లు, పర్సనల్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి ఎం. శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, సంక్షేమ అధికారి రజిని కుమార్, సీఎంపిఎఫ్ ఉద్యోగులు మనోహర్, అనిత, అన్ని విభాగాల సంక్షేమ జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.




## గ్రూప్ 2 కొలువు సాధించిన ఉద్యోగిని సన్మానించిన జీఎం

**బెల్లంపల్లి, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

సింగరేణి ఉద్యోగం చేస్తూ పట్టుదలతో గ్రూప్ 2 కొలువు సాధించిన ఉద్యోగిని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర్ రెడ్డి గురువారం గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణలో సన్మానించారు. ఏరియా స్టోర్స్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భాస్కర్ ఉప తహసిల్దార్‌గా కొలువు సాధించారు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంధాలయంలో రాత్రి పూట, సెలవు రోజుల్లో పట్టుదలతో చదివి గ్రూప్ 2 సాధించినందుకు జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి భాస్కర్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. గోలేటిలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంధాలయాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని జనరల్ మేనేజర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కె. రాజమల్లు, ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి, డీజీఎం (ఐఈ) ఉజ్వల్ కుమార్ బెహెరా, ఎస్ఈ ఏరియా వర్క్ షాప్ జ్ఞానేశ్వర్, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, సిహెచ్పి ఇంచార్జి కోటయ్య, పర్సనల్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి ఎం. శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి డి. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.





## రోంపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ

**తిర్యాని, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

మండలంలోని రోంపల్లి గ్రామంలో పశువుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా గాలికుంటు వ్యాధి (ఎఫ్ఎండీ) నివారణకు టీకాల కార్యక్రమం నిర్వహించారు.తిర్యాని పశువైద్యశాల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన 312 పశువులకు టీకాలు వేయడం జరిగింది.ఈ సందర్భంగా పశువైద్యాధికారి సాగర్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి పశువులకు తీవ్ర ప్రభావం చూపే వైరల్ వ్యాది అని ఇది పశువుల పాల ఉత్పత్తి తగ్గించడంతో పాటు, వ్యవసాయ పనులపైనా ప్రభావం చూపుతుందన్నారు.టీకాలు వేయించడం వల్ల వ్యాధి వ్యాప్తిని పూర్తిగా నియంత్రించవచ్చని తెలిపారు.అలాగే టీకా వేసిన అనంతరం పశువుల్లో ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే పశువైద్యశాలను సంప్రదించాలని ఆయన గ్రామస్తులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సురేష్, మనోహర్, రాకేష్, సంతోష్,రైతులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగం పాత్ర కీలకం

**- జీఎంలు మునిగంటి శ్రీనివాస్, చందా లక్ష్మీనారాయణ**

**నస్పూర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగం పాత్ర కీలకమని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్, జనరల్ మేనేజర్, సెక్యూరిటీ (కార్పొరేట్) చందా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సెక్యూరిటీ విభాగం ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్లు మాట్లాడుతూ, సింగరేణిలో శ్రీరాంపూర్ ఏరియా అత్యంత కీలకమైనదని, సింగరేణి భూములు, ఆస్తులను రక్షించడంలో సెక్యూరిటీ సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, సిసి కెమెరాతో ఎల్లవేళలా పరిశీలిస్తూ ఉండాలని, నూతన సాంకేతికతను ఉపయోగించి ముందుకు వెళ్లాలని, సెక్యూరిటీ సిబ్బంది క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వహి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కా రెడ్డి, సీనియర్ పీవో పి. కాంతారావు, ఇన్స్పెక్టర్ రాజన్న, సెక్యూరిటీ విభాగం ఉద్యోగులు, ప్రైవేట్ సెక్యూరిటీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థుల మానసిక సమస్యపై అవగాహన సదస్సు

**లక్షెట్టిపేట, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల లక్షెట్టిపేట కళాశాలలో డిస్టిక్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అయినటువంటి డాక్టర్ లింగ రెడ్డి ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యం పై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డిస్టిక్ సైకియాట్రిస్ట్ డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ.. పిల్లల మానసిక సమస్యలపై చక్కటి అవగాహన కల్పించారు. వారు పరీక్షల ఒత్తిడిని ఎలా నివారించుకోవాలో చక్కగా చెప్పారు. అలాగే లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎలా సన్నద్ధం కావాలో చక్కగా వివరించారు. అంతేకాదు ఏవైనా మానసికంగా బాధలు అనిపిస్తే కచ్చితంగా పక్కవారితో పంచుకోవాలని ఈ విధంగా చేస్తే చాలావరకు సమస్యలు పరిష్కారం అవుతాయని వివరించారు. అంతేకాదు ఇంకా చెప్పుకోలేని సమస్య ఎదురైనప్పుడు, మొహమాట పడకుండా 14416 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి సమస్య వివరించాలని తప్పకుండా మానసిక సమస్య తీరుతుందని చెప్పారు. తర్వాత ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. కార్డియాక్ అరెస్ట్ అయినప్పుడు చేయవలసిన అత్యవసర ప్రాథమిక చికిత్స అయినటువంటి సిపిఆర్ గురించి విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులతో కూడా ప్రాక్టీస్ చేయించారు. అలాగే డిస్టిక్ ఆఫీసర్ అయినటువంటి లింగారెడ్డి ధూమపానం మనుషుల ఆరోగ్యానికి ఎంత హాని చేస్తుందో చక్కగా వివరించారు. తర్వాత విద్యార్థులు తమకున్న సందేహాలను నివృత్తి పరుచుకున్నారు. తమ అభిప్రాయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రమా కళ్యాణి మాట్లాడుతూ.. పిల్లలకు తెలియనటువంటి చక్కటి విషయాలను చాలావరకు తెలియపరచినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రమా కళ్యాణి, వైస్ ప్రిన్సిపాల్ గీతాంజలి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ శిరీష, హెల్త్ సూపర్వైజర్ పల్లవి, అలాగే మెంటల్ వెల్ బీయింగ్ ట్రైనర్స్ అయినటువంటి గీతాంజలి, సుజాత బోధన సిబ్బంది అందరు పాల్గొన్నారు.

# తగ్గిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజులు

**సారంగాపూర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ప్రథమ సంవత్సర ఫస్ట్ సెమిస్టర్ విద్యార్థులకు పెంచిన పరీక్ష ఫీజులును అధికారులు తగ్గించారు. ఇటీవల మొదటి సెమిస్టర్ విద్యార్థులకు సైన్స్ 3250, ఆర్ట్స్ 3150 నిర్ణయించారు. దీంతో పేద విద్యార్థులు పెంచిన ఫీజులు, కట్టలేమని వాపోయి, ధర్నాలు, వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. వారి ఇబ్బందులపై వార్త దిన పత్రికలో ఈనెల 12వ తేదీన భారమైన పరీక్ష ఫీజు అనే కథనం ప్రచురించడమైనది. స్పందించిన అధికారులు పరీక్ష ఫీజులను తగ్గించి గత సంవత్సరంలోని ఫీజులను చెల్లించాలని విద్యార్థులకు సూచించారు. బిఎస్సి, బికాం ఫస్ట్ సెమిస్టర్ ఫీజు 1640 రూపాయలు, బిఏ 1440 రూపాయలు చెల్లించాలని నిర్ణయించారు. పరీక్ష ఫీజు చివరి తేదీఈ నెల 23అని ప్రకటించారు.

# మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళాను సద్వినియోగం చేసుకోండి

**సిరికొండ, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

జిల్లా ఎస్పీ అచల్ మహాజన్ ఆధ్వర్యంలో నిర్వహించే లైసెన్స్ మేళ కార్యక్రమంలో భాగంగా టూ వీలర్, ఫోర్ వీలర్ కలిగిన సిరికొండ మండలంలోని యువతి, యువకులు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్సై పూజ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై పూజ తెలిపిన వివరాల ప్రకారం మొదటగా యువతి, యువకులు డ్రైవింగ్ లైసెన్స్ కోసం అప్లై చేసుకోవలసి ఉంటుందని తెలిపారు. టూ వీలర్, ఫోర్ వీలర్ లైసెన్స్ కోసం అప్లై చేసే యువతి, యువకులు డాక్యుమెంట్లని సిరికొండ మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అందజేయాలన్నారు. స్లాట్ బుకింగ్ కోసం ఒక తేదీని నిర్ణయించి ప్రకటిస్తామన్నామని పేర్కొన్నారు. ఆరోజు పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు.





# ఐటీడీఏ దినసరి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

## - స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్ కి విజ్ఞప్తి చేసిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

**ఆసిఫాబాద్, అక్టోబర్ 16, ప్రభాత వార్త**

ఐటీడీఏ (సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ) పరిధిలో పనిచేస్తున్న దినసరి (డైలీ వేజ్) మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలపై ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి ్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్ కి శుక్రవారం వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం సవ్యసాచి ఘోష్ కి ఈ ఉద్యోగుల దుర్భర పరిస్థితులను ఎమ్మెల్యే కోవలక్ష్మి ్ర వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి ్ర మాట్లాడుతూ దినసరి మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు దాదాపు 30 సంవత్సరాలుగా తమ సేవలను అందిస్తున్నారని తెలిపారు. వీరంతా గిరిజనులే అయినప్పటికీ, వారికి ఇప్పటివరకు ఉద్యోగ భద్రత కల్పించకపోవడం అత్యంత బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు సరిగా జీతాలు రాకపోవడం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాయని, తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందని కోరారు. ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న దినసరి ఉద్యోగులు మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అందరికీ బకాయిల వేతనాన్ని వెంటనే చెల్లించాలని, అలాగే వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కి విజ్ఞప్తి చేశారు.

# భవన నిర్మాణంలో నాణ్యత పాటించాలి

## - కౌటాల ఎంపీడీవో కోట ప్రసాద్

**కౌటాల, అక్టోబర్ 16 (ప్రభాత వార్త):**

భవన నిర్మాణం పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి సమయానికి పూర్తిచేయాలని కౌటాల ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. మండలంలోని శిర్షలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. భవన నిర్మాణంలో ఉపయోగిస్తున్న సామాగ్రిని స్వయంగా పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. భవన నిర్మాణం నాణ్యతతో పూర్తి చేయాలి కాంట్రాక్టర్‌ను ఆయన ఆదేశించారు. తదనంతరం గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఎంపీడీవో పరిశీలించారు. ఇప్పటికే పూర్తి చేసిన ఇండ్ల పనితీరును సమీక్షి ంచగా, ఇంకా ప్రారంభించని లబ్ధిదారులు తక్షణమే పనులు మొదలు పెట్టాలని సూచించారు. ప్రజల సంక్షేమ పథకాల ఫలితాలు ప్రతి అర్హుడి దాకా చేరేలా అధికార యంత్రాంగం కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విఠల్ సహా గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

